సాక్షి
కాకినాడ
శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



రూ.1,11,600 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి పుణ్యమంతుల సత్యనారాయణ దంపతులు (హైదరాబాద్) గురువారం రూ.1,11,600 విరాళం సమర్పించారు.




అమ్మమ్మ ఇంటికి వచ్చి.. అనంతలోకాలకు..

8 లో

బైక్ బోల్తా పడి.. ఓ బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన బాధిత కుటుంబాల్లో విషాదం నింపింది.

డెల్టాలకు 8,650 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,450, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.70 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

రేపు, ఎల్లుండి నామినేషన్లకు సెలవు

కాకినాడ సిటీ: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి శని, ఆదివారాల్లో నామినేషన్లు స్వీకరించబోమని రిటర్నింగ్ అధికారి, ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు.

కుంభమేళాకు రేపు ప్రత్యేక రైలు

కాకినాడ: ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న **మహా కుంభమే**ళాకు రైల్వే శాఖ కాకినాడ రైల్వే **స్టేషన్ నుంచి** శనివారం మరో అదనపు రైలు **ఏర్పాటు చేసిం**ది. 07095 నంబర్‌తో నడిచే ఈ **రైలు కాకినా**డలో శనివారం మధ్యాహ్నం **2.30 గంటలకు** బయలుదేరుతుంది. రెండు **రోజుల తర్వాత** ప్రయాగ్ రాజ్ చేరుతుంది. కాగా, **కాకినాడ** నుంచి ఏసీ బోగీలతో ఒక **ప్రత్యేక రైలును** ఈ నెల 20న ప్రయాగ్ రాజ్‌కు **ఏర్పాటు చేసిన** విషయం తెలిసిందే. అదనపు **రైలు కోసం** భక్తుల నుంచి వస్తున్న డిమాండ్ **మేరకు ఎంపీ** తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ రైల్వే **మంత్రి అశ్విని** వైష్ణవ్‌కు లేఖ రాశారు. ఈ మేరకు మరో రైలు కూడా ఏర్పాటు చేశారు.

ఏలేరు ఆయకట్టుకు 1,600 క్యూసెక్కులు

ఏలేశ్వరం: రబీ సాగు నిమిత్తం ఏలేరు రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విశాఖకు 200, తిమ్మరాజు చెరువుకు 100 క్యూసెక్కుల చొప్పున అందిస్తున్నారు. ఆయకట్టు పరిధిలో సుమారు 54 వేల ఎకరాల్లో రబీ సాగు జరుగుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, గురువారం 81.81 మీటర్లుగా నమోదైంది. రిజర్వాయర్ సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, 15.63 టీఎంసీల మేర నీటి నిల్వలున్నాయి.

రేపు నవోదయ ఎంపిక పరీక్ష

పెద్దాపురం: పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులకు శనివారం ఉదయం 11 గంటలకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నవోదయ విద్యాలయలో పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, సెంటర్ లెవెల్ పరిశీలకులతో నవోదయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల నిర్వహణకు పెద్దాపురంలో 9 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. తొమ్మిదో తరగతికి 1,451 మంది, 11వ తరగతిలోకి ప్రవేశానికి 699 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

బీసీ హాస్టళ్లలో సంక్షేమం అగమ్యగోచరం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బీసీ హాస్టళ్లలో సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం అగమ్యగోచరంగా మారుస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కుటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీ రక్షణ చట్టం అమలు చేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. అద్దె భవనాల్లోని హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మిస్తామన్నారని, మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచుతామన్నారని, ఇవేవీ నెరవేరలేదని అన్నారు. బాలికల హాస్టళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉన్నత న్యాయస్థానం చెప్పినా అమలు చేయలేదన్నారు. పోస్టులు భర్తీ చేయకపోవడంతో హాస్టళ్లను ఇన్‌చార్జి వార్డెన్లు నడుపుతున్నారని, మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. హాస్టళ్లలోని పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక కమిషన్ వేయాలని కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు.

పాఠశాల విద్యను పరిరక్షించాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పాఠశాల విద్యను కాపాడాలని, ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ, అఖిల భారత విద్యా హక్కు వేదిక ఆధ్వర్యాన వివిధ సంఘాల నాయకులు ఆర్ట్స్ కళాశాల ఎదుట గురువారం ఆందోళన చేశారు. ఏపీటీఎఫ్ (1938), పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, డీటీఎఫ్ నాయకులు ఇందులో పాల్గొన్నారు. నివాసాలకు 1, 3, 5 కిలోమీటర్ల దూరంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కొనసాగించాలని నినాదాలు చేశారు. విద్యార్థుల నమోదు 40 శాతం దాటిన అన్ని ప్రాథమిక పాఠశాలలకు విద్యాహక్కు చట్టానికి అనుగుణంగా ఆంగ్ల బోధనకు ఒక పోస్టు ఇవ్వాలని, 50 వేల ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డేవిడ్ లివింగ్‌స్టన్, కేవీవీ సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయబ్రహ్మం, గౌరవాధ్యక్షుడు అప్పయ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



ఎయిర్‌పోర్టు ఏర్పాటు సాధ్యం కాదని ఏఏఐ పేర్కొన్న అన్నవరం - బెండపూడి భూములు



ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు తాజాగా ప్రతిపాదిస్తున్న గురజనాపల్లిలోని సాల్ట్ కమిషనర్ భూములు

కూటమికి విమానం మోత

- విమానాశ్రయంపై తలోక ప్రతిపాదన
- నేతల మధ్య ఆధిపత్య పోరు
- అన్నవరం ఎయిర్‌పోర్టు సాధ్యం కాదన్న ఏఏఐ
- సాల్ట్ భూములపై తాజా ప్రతిపాదన



సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'ఎగిరిపోతే ఎంత బాగుంటుందో' అంటూ పల్లవి అందుకుంటున్నారు కూటమి నేతలు. గాలిలో మేడలు కట్టడం, లాండ్ అవ్వని విమానాలను.. వచ్చేస్తున్నట్టు బిల్డప్‌లు ఇవ్వడం చంద్రబాబు సర్కార్‌కు కొత్తేమీ కాదు. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. రాష్ట్రంలో ఆరు ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేస్తున్నట్టు కూటమి ప్రభుత్వం రెండు నెలల క్రితం ఆర్భాటంగా ప్రకటించింది. అందులో ఒకటి కాకినాడ జిల్లాకు ఇస్తున్నట్టు చెప్పుకొచ్చింది. కోల్‌కతా - చెన్నై జాతీయ రహదారికి సమీపాన అన్నవరం - బెండపూడి మధ్య ఈ విమానాశ్రయం ఏర్పాటుకు ప్రతిపాదించారు. దీనికి సుమారు 757 ఎకరాలు అవసరమని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రాథమికంగా నిర్ధారించింది. తొండంగి మండలం బెండపూడి, పీఈ చిన్నాయిపాలెం గ్రామాల పరిధిలో భూ సేకరణకు ప్రతిపాదించారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు, భూ సేకరణ సాధ్యాసాధ్యాలపై ఇటీవలే ఏఏఐ అధ్యయనం పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదించింది. దీని ప్రకారం ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ఈ ప్రాంతంలో అంతగా సానుకూలత లేదని ఏఏఐ పేర్కొన్నట్టు తెలుస్తోంది. ఇదే విషయాన్ని జిల్లా అధికారులు కూడా ప్రైవేటు సంభాషణల్లో ప్రస్తావించారు.

ఇవీ ప్రతికూలతలు

ప్రతిపాదిత అన్నవరం ఎయిర్‌పోర్టుకు సేకరించే భూములకు రూ.కోట్లలో పరిహారం చెల్లించాల్సి ఉంది. కాకినాడ స్పెషల్ ఎకనామిక్ జోన్ (కేఎస్ఈజెడ్) పరిధిలో ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించిన దివీస్, ఇటీవలే ఉత్పత్తి ప్రారంభమైన లీఫియస్‌తో పాటు, భవిష్యత్‌లో ఏర్పాటవుతాయని చెబుతున్న ఫార్మా కంపెనీల నుంచి వచ్చే ఎయిర్ కార్గోపై అంచనాలు తప్పాయని ఏఏఐ నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. అలాగే, ఒకవైపు 100 కిలోమీటర్లలోపే రాజమహేంద్రవరం, మరోవైపు 150 కిలోమీటర్లలోపు విశాఖపట్నం విమానాశ్రయాలు ఉండటం కూడా ప్రతికూల అంశాలని ప్రస్తావించినట్టు తెలుస్తోంది. వాస్తవానికి తుని - బెండపూడి మధ్య ఎయిర్‌పోర్టు ఏర్పాటు టీడీపీలో చంద్రబాబు తరువాత అంతటి ప్రాధాన్యం కలిగిన సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడి చిరకాల ఆశ. అక్కడ ఎయిర్‌పోర్టు వస్తే నష్టపోయే 1,200 మందీ కూడా చిన్న రైతులే. అయితే ఈ ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల యనమల అనుచరులు, బంధువులు గతంలో దండిగా భూములు కొన్నారని, అందువల్లనే ఈ విమానాశ్రయం కోసం వారు పట్టుబట్టారని అంటున్నారు.

అందుబాటులో 1,195 ఎకరాలు

అన్నవరం విమానాశ్రయ నిర్మాణానికి ఏఏఐ సానుకూలంగా లేకపోవడంతో కాకినాడ శివారు చొల్లంగి - గురజనాపల్లి మధ్య కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సాల్ట్ కమిషనర్ భూములను తెర మీదకు తీసుకువచ్చారు. కత్తిపూడి - దిగమర్రు హైవేకు ఆనుకుని.. పెనుగుదురులో 566.50, గురజనాపల్లిలో 560.50, చొల్లంగి పరిసరాల్లో 68 కలిపి మొత్తం 1,195 ఎకరాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఉప్పు సాగు కోసం ఈ భూములను లీజు ప్రాతిపదికన ఇస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని అప్పటి లోక్‌సభ స్పీకర్ దివంగత జీఎంసీ బాలయోగి మూడు దశాబ్దాల క్రితమే ప్రతిపాదించారు. ఈ భూములను అప్పగించే ప్రతిపాదనను అప్పట్లోనే ఆయన సాల్ట్ కమిషనర్ దృష్టికి కూడా తీసుకుని వెళ్లారు. ఎయిర్‌పోర్టు అథారిటీతో పాటు సాల్ట్ కమిషనర్ కూడా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉన్నారు. ఈ క్రమంలో పైసా పరిహారం ఇవ్వనవసరం లేకుండా భూ సేకరణ పూర్తి చేయవచ్చునని కాకినాడ సిటీ, రూరల్ ప్రజాప్రతినిధులు ఒక రోడ్ మ్యాప్ తయారు చేశారు. అయితే, ఎయిర్‌పోర్టుకు భూములు సేకరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. అందువలన సాల్ట్ భూములు కేటాయిస్తే.. దానికి సంబంధించిన సొమ్మును కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది.

సాల్ట్ భూముల్లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తే ఇటు కాకినాడ జిల్లాతో పాటు అటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం పరిసర ప్రాంతాలకు కూడా కేవలం 60 కిలోమీటర్ల దూరంలోనే విమాన సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఎయిర్‌పోర్టు ఇటా అటా అనే దానిపై కూటమి నేతల మధ్య ఆధిపత్య పోరు జరుగుతోంది. అసలు ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉందా లేక.. సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ కుప్పిగంతులాడుతున్నారా అనే చర్చ నడుస్తోంది.

గుండెపోటు బాధితులకు ఉచితంగా ఇంజక్షన్

- కలెక్టర్ షణ్మోహన్
- అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



గుండెపోటు ఇంజక్షన్‌పై ముద్రించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: గుండెపోటు బాధితులకు జిల్లాలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో అత్యవసర వైద్యం అందుబాటులో ఉందని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గుండెపోటు లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా ప్రభుత్వాసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ ఎస్.స్వప్నతో కలిసి కలెక్టరేట్‌లో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తుని ఏరియా ఆసుపత్రితో పాటు జిల్లాలోని 9 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గుండెపోటు బాధితులకు అందించే ఇంజక్షన్ అందుబాటులో ఉందన్నారు. రూ.40 వేల విలువైన ఈ ఇంజక్షన్‌ను ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ గుండెపోటుకు గురైన 82 మందికి ఈ ఇంజక్షన్ అందించామన్నారు. గుండె నొప్పికి గురయ్యే వారు తొలి గంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందించాల్సిన వైద్య సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ కోరారు.

జీజీహెచ్ అభివృద్ధికి కృషి చేయాలి

ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్) అభివృద్ధికి ప్రణాళిక ప్రకారం పని చేయాలని వైద్యాధికారులను కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. జీజీహెచ్, ఆరోగ్యశ్రీ, ఇతర విభాగాల అధికారులతో గత నెలలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో తీర్మానించిన అంశాల పురోగతిపై కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ పి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివరాత్రి ఉత్సవాలు

- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ సూచన



సమీక్షలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ భావన

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో అత్యంత వైభవంగా నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన సూచించారు. వివిధ శాఖల అధికారులతో పంచారామ క్షేత్రంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భక్తులందరికీ దర్శనాలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. పారిశుధ్యం, లైటింగ్ ఏర్పాట్లను మున్సిపాలిటీ చూస్తుందని చెప్పారు. తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు బందోబస్తుకు అదనపు సిబ్బందిని తీసుకుంటామని సీఐ కృష్ణభగవాన్ చెప్పారు. భక్తులకు సేవలు చేసే స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ఎన్‌సీసీ విద్యార్థుల పేర్లు ముందుగా తీసుకోవాలని సూచించారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం మాట్లాడుతూ, పంచారామ క్షేత్రంలో ఈ నెల 24 నుంచి మార్చి 1వ తేదీ వరకూ మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. గోదావరి కాలువ కొత్త బ్రిడ్జిపై ఉన్న మట్టిపై తరచూ వాటరింగ్ చేయించాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు మాట్లాడుతూ, భక్తులు పుణ్యస్నానాలు చేసే గోదావరి కాలువలోకి కలుషిత జలాలు రాకుండా అధికారులు శ్రద్ధ చూపాలని కోరారు. మాండవ్య నారాయణస్వామి కాలి బాట వంతెన ఎదురుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువన ఖాళీ స్థలంలో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఫణిత మాట్లాడుతూ, కాలువలోకి కలుషిత జలాలు రాకుండా పరిసరాల్లోని పరిశ్రమలకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. మున్సిపాలిటీ నుంచి అవసరమైన అన్ని సేవలూ అందిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య హామీ ఇచ్చారు.

పరిహారం చెల్లించాకే పనులు

- పోలవరం కాలువ నిర్వాసితుల డిమాండ్
- రెండో రోజూ పనుల అడ్డగింపు



పోలవరం కాలువ పనులను అడ్డుకుంటున్న బాధిత రైతులు, నిర్వాసితులు

తుని రూరల్: చట్ట ప్రకారం తమ భూములకు, ఇళ్లకు నష్ట పరిహారం చెల్లించిన తర్వాతే పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు చేపట్టాలని కుమ్మరిలోవ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆర్‌వీఆర్ సంస్థ సిబ్బంది రెండో రోజైన గురువారం కాలువ పనులకు ఉపక్రమించగా బాధిత రైతులు, నిర్వాసితులు అడ్డుకున్నారు. జేసీబీ పైకి ఎక్కి ఆందోళన చేశారు. కాంట్రాక్ట్ సిబ్బందితో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సర్వేయర్ జాగారాలు, పోలవరం ఇరిగేషన్ డీఈ మురళి, ఏఈలు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. తాండవ నది, కంట్రాక్టు కొండ మీదుగా పోలవరం కాలువ తవ్వి, అక్విడెక్టు నిర్మించేందుకు అడ్డంకిగా ఉన్న కుమ్మరిలోవ కాలనీలో ఇళ్లు, 46.92 ఎకరాల జిరాయితీ భూమి సేకరించాల్సి ఉంది. ఇళ్ల సేకరణ ప్రక్రియ 90 శాతం పూర్తవగా భూసేకరణ సందిగ్ధంలో ఉంది. తుని పట్టణాన్ని ఆనుకుని ఉన్న విలువైన భూములపై తమతో సంప్రదించకుండా అధికారులు రూ.1,87,580 చొప్పున కోర్టులో అవార్డు జమ చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఎకరా రూ.3 కోట్లు పైగా పలుకుతోందన్నారు. నిర్వాసితుల కోసం కిలోమీటరు దూరంలో సేకరించిన భూములకు ఎకరాకు రూ.20 లక్షలు పైగా చెల్లించిన అధికారులు.. పట్టణాన్ని ఆనుకుని ఉన్న భూములకు విలువ కట్టడంలో నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. అలాగే, జిరాయితీ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివాసం ఉంటున్న కుటుంబాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో మరి కొంత మందికి కూడా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందాల్సి ఉందన్నారు. తమకు పరిహారం చెల్లించిన తర్వాతే పోలవరం కాలువ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధితుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని సర్వేయర్ జాగారాలు, డీఈ మురళి చెప్పారు. జక్కాన రామునాయుడు, జక్కాన రామచంద్రరావు, పోతల రాంబాబు, బాధితులు, నిర్వాసితులు తమ డిమాండ్లను రాతపూర్వంగా సర్వేయర్, డీఈలకు అందజేశారు.

ఇల అంతర్వేది పురములో..

- లక్ష్మీ నారసింహుని కల్యాణానికి సర్వం సిద్ధం
- నేటి రాత్రి 12.55 గంటలకు దివ్య ముహూర్తం
- రేపు మధ్యాహ్నం 2.05 గంటలకు రథోత్సవం
- రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
- తిరుపతి ఘటన నేపథ్యంలో భారీ భద్రత



సాక్షి, అమలాపురం/సఖినేటిపల్లి/మలికిపురం: తూర్పున ఉవ్వెత్తున ఎగసే సాగర కెరటాల హోరు.. పశ్చిమాన వశిష్ఠ గోదావరి గలగలలు.. ఆ నడుమ సాగర సంగమ తీరంలో వెలసిన దేవదేవుడు.. ఆ లక్ష్మీ నారసింహుడు కొలువైన అంతర్వేది పుణ్యక్షేత్రం నిత్యం ఆధ్యాత్మిక పరవళ్లతో ఇల వెలసిన వైకుంఠంలా దర్శనమిస్తోంది. భక్తకోటి నడకలు ఆ పుణ్యక్షేత్రం దారుల్లోనే సాగుతున్నాయి. స్వామివారి కల్యాణ ఘడియలు దగ్గరపడుతున్నకొద్దీ వారి నడకల్లో వడి పెరిగింది. వేదిక సర్వాంగ సుందరమై వధూవరుల రాకకోసం నిరీక్షిస్తోంది. తారా మండలం భువికొచ్చిందా అన్నట్టు విద్యుద్దీప కాంతులతో ఆ ప్రాంతమంతా శోభాయమానమై భాసిల్లుతోంది. భక్తుల కోర్కెలు తీర్చే లక్ష్మీనరసింహుని కల్యాణం శుక్రవారం జరగనుంది. దీనికి లక్షలాది మంది భక్తులు తరలి రానున్నారు. 'ధరణిలో పుణ్యధామం, దర్శించిన ఎంతో భాగ్యం' అని నమ్మే భక్తులు అంతర్వేదికి దారి తీస్తున్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన శుక్రవారం రాత్రి 12.55 గంటలకు మృగశిరా నక్షత్రయుక్త వృశ్చిక లగ్నంలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో స్వామివారి కల్యాణాన్ని అర్చకులు నిర్వహించనున్నారు. తరువాత రోజయిన శనివారం మధ్యాహ్నం 2.05 గంటలకు భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రథోత్సవం కన్నుల పండువగా సాగనుంది. కల్యాణం, తరువాత రోజు సముద్ర స్నానాలు, స్వామివారి దర్శనం, రథోత్సవం తదితర కార్యక్రమాలకు సుమారు రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వాసులతో పాటు కృష్ణా జిల్లా నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. రాజోలు దీవిలో కొన్ని కుటుంబాల వారు ఈ కల్యాణంలో పాల్గొనడంతో పాటు కల్యాణాన్ని తిలకించడం ఆనవాయితీగా వస్తోంది.

తిరుపతి ఘటన నేపథ్యంలో..

వైకుంఠ ఏకాదశి నాడు తిరుపతిలో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన నేపథ్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడకుండా చర్యలు తీసుకుంటున్నారు.

అంతర్వేదిలో నేడు


కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పంచముఖ ఆంజనేయ వాహనంపై, రాత్రి 8 గంటలకు కంచు గరుడ వాహనంపై లక్ష్మీ నరసింహస్వామి వారి గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు. రాత్రి 12.55 గంటలకు స్వామివారి వార్షిక తిరు కల్యాణం నిర్వహించనున్నారు.

ఇవీ హెల్ప్‌లైన్లు

కమాండ్ కంట్రోల్	: 08862-243500
పోలీసు డయల్ నంబర్	: 100
సఖినేటిపల్లి ఎస్సై	: 9440796566
రాజోలు సీఐ	: 9440796526
తహసీల్దార్	: 9849903893
వీఆర్వో	: 9701835669
ఎంపీడీవో	: 9491575915
అంతర్వేది కార్యదర్శి	: 9493062920
డాక్టర్ యూనస్	: 8792257516
రాజోలు ఆర్టీసీ ఎంక్వయిరీ	: 08862-221057

భద్రతా చర్యలివీ..

- ఆలయ సమీపంలో పర్యాటక శాఖ అతిథి గృహం వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్‌ను, బీచ్ వద్ద కూడా తొలిసారిగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.
- 20 డ్రోన్‌లు, 100 సీసీ కెమెరాలతో భద్రతను పర్యవేక్షించనున్నారు. భక్తుల కోసం రూట్ మ్యాప్ విడుదల చేశారు.
- 1,550 మంది పోలీసు సిబ్బందిని భద్రతకు వినియోగిస్తున్నారు. 10 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 100 మంది ఎస్సైలు, 1,400 మంది కానిస్టేబుల్స్, మరికొంత మంది హోంగార్డులు విధుల్లోకి రానున్నారు.
- బీచ్‌వద్ద భక్తుల రక్షణకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో 4 రెస్క్యూ బోట్లు, 100 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు.
- ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా వన్‌వే అమలు చేస్తున్నారు. వాహనాలను కేశవదాసుపాలెం మీదుగా అంతర్వేది పంపించనున్నారు. ఆలయం నుంచి వచ్చే వాహనాలు ఏటిగట్టు మీదుగా గొంది, గుడిమూల, సఖినేటిపల్లి సెంటర్ మీదుగా వెళ్లాలి. భక్తుల వాహనాలకు గుర్రాలక్క గుడికి సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- ఆలయం వద్ద, రథం షెడ్డు వద్ద పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాలలో 340 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. 120 మొబైల్ టాయిలెట్లు, 5 వైద్య శిబిరాలు, మూడు 108 వాహనాలు, 104 వాహనాలు అందుబాటులో ఉంచారు. 26 మంది వైద్యాధికారులు, 85 మంది పారా మెడికల్ సిబ్బంది సేవలు అందించనున్నారు.
- ఆర్టీసీ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, నర్సాపురం, పాలకొల్లు నుంచి 40, కోనసీమ జిల్లా అమలాపురం, రాజోలు నుంచి 65 ప్రత్యేక బస్సులు భక్తుల కోసం నడపనుంది.
- కల్యాణం రోజున సాధారణ భక్తులు స్వామి కల్యాణాన్ని వీక్షించేలా 12 ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు.



తీర్థంలో శివాలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా వ్యవస్థ

క్లుప్తంగా

తెలికిచెర్లలో గంజాయ్ బ్యాచ్!

- పోలీసుల అదుపులో జనసేన కార్యకర్తలు
- భారీ ఎత్తున సరకు స్వాధీనం

నల్లజర్ల: మండలంలోని తెలికిచెర్లలో గంజాయి బ్యాచ్‌పై తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు గురువారం తెల్లవారుజామున దాడి చేశారు. ఈ సంఘటనకు సంబంధించి తాడేపల్లిగూడెంలో దొరికిన ఆధారాలతో అక్కడి వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టణ పోలీసులు గురువారం తెల్లవారుజామున తెలికిచెర్లలో కంకిపాటి నాగరాజు, కుంచే శ్రీహరి, గుండుబోగుల మురళి ఇళ్లలో సోదాలు చేసి అధిక మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకుని ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులను వివరణ కోరగా ఈ విషయం వాస్తవమేనని శుక్రవారం విలేకరుల సమావేశంలో విషయాలు వెల్లడిస్తామని చెప్పారు. నిందితులంతా జనసేన కార్యకర్తలు కావడం గమనార్హం.

రికార్డుల సాధనలో కృష్ణ కామేశ్వర్ హ్యాట్రిక్



లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో కృష్ణ కామేశ్వర్

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన నాణేలు, కరెన్సీ నోట్ల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ పేరు ఈ సంవత్సరం లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రకటించిన జాబితాలో నమోదైంది. ఆ బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా రెండు రికార్డులను సాధించారు. కరెన్సీ నోట్లు, తపాలా బిళ్లల సేకరణలో ఈ రికార్డులను ఆయన కైవసం చేసుకున్నారు. 2023 సంవత్సరంలో కృష్ణ కామేశ్వర్ కరోనా నాణేల సేకరణలోనూ, 2014లో తపాలా బిళ్లల సేకరణలోనూ రెండు రికార్డులను సాధించిన విషయం తెలిసిందే. 2025 పుస్తకంలో చోటు చేసుకునే రికార్డుల్లో అత్యధిక ముఖ విలువ కరెన్సీ నోట్లను సేకరించినందుకు ఒకటో రికార్డు సాధించారు. ఇందులో 91 దేశాలకు చెందిన 100 నుంచి వంద క్వాడ్రిల్లియన్ (ఒకటి పక్కన 17 సున్నలు) వరకూ ముఖ విలువ కలిగిన 306 నోట్లు ఉన్నాయి. రూ.5 ముఖ విలువ కలిగిన తపాలా బిళ్లల విభాగంలో 360 తపాలా బిళ్లలను సేకరించి రెండో రికార్డు సాధించారు. కృష్ణ కామేశ్వర్ నాణేలు, కరెన్సీ నోట్లు, తపాలా బిళ్లల సేకరణలో ఒకొక్క విభాగంలో ఒక్కో లిమ్కా రికార్డు సాధించి మొత్తంగా నాలుగు రికార్డులను పొందిన తొలి తెలుగు వ్యక్తి కావడం గమనార్హం.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

నిడదవోలు: పట్టణంలో చినకాశిరేవు వద్ద గురువారం రైలుపట్టాలపై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చాగల్లు మండలం నందిగంపాడు గ్రామానికి చెందిన ఆత్కూరి లింగేశ్వరరావు (44)కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఇతని భార్య విడిపోయి పదేళ్ల నుంచి దూరంగా ఉంటోంది. దీంతో మద్యానికి బానిసైన లింగేశ్వరరావు మనస్తాపంతో రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్సై పి.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హంస వాహనా.. శేష శయనా..



హంస వాహనంపై లక్ష్మీనృసింహుని గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



ధ్వజా రోహణ చేస్తున్న అర్చకులు

- భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహుడు
- కనుల పండగగా గ్రామోత్సవాలు
- కొనసాగుతున్న విశేష కార్యక్రమాలు

సఖినేటిపల్లి: అంతర్వేదిలో లక్ష్మీనృసింహుని కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం సాయంత్రం హంస వాహనంపైన, రాత్రి శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. అలాగే స్వామివారి సన్నిధిలో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు విశేష పూజలు చేశారు. తొలుత స్వామివారి సన్నిధిలో పుణ్యాహవచనం, వాస్తుపూజ, గరుత్మంతుని హోమం, అంకురార్పణ, ధూపసేవ, ధ్వజా రోహణ, గరుత్మంతుని చిత్రపటం ఆవిష్కరణ నిర్వహించారు.

ఏడు రోజుల పాటు విష్ణుదీక్ష

గురువారం నుంచి పౌర్ణమి వరకూ ఉత్సవాల నిర్వహణకు అర్చకులు ఏడు రోజులు పాటు విష్ణుదీక్ష తీసుకున్నారు. ఏటా ఈ దీక్ష చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. అర్చకులకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ దీక్షా వస్త్రాలను అందజేశారు.

భక్తి శ్రద్ధలతో అంకురార్పణ

స్వామివారి దీక్ష తీసుకున్న అర్చకులు భక్తిశ్రద్ధలతో అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహించారు. నవ ధాన్యాలను పుట్టమట్టిపై చల్లి, సర్వ దేవతలను ఆవాహన చేసి, ఏడు రోజుల పాటు అర్చనకు శ్రీకారం చుట్టారు. ఈ నవధాన్యాల నుంచి మొక్కలు ఎంత ఏపుగా ఎదిగితే అంతమేర గ్రామాలు పాడిపంటలతో సుభిక్షంగా ఉంటాయని పురాణ ప్రతీక.

ధ్వజారోహణ

స్వామివారి కల్యాణ మహోత్సవాలకు సకల దేవతలకు గరుత్మంతుని ద్వారా ఆహ్వానం పలుకుతూ ధ్వజస్తంభంపై ధ్వజపటం ఎగురవేయడమే ధ్వజారోహణ అని ప్రధాన అర్చకుడు శ్రీనివాస కిరణ్ తెలిపారు. కల్యాణ మహోత్సవాలకు దుష్ట శక్తుల వల్ల ఎటువంటి అవరోధాలు లేకుండా ఉండేందుకు కూడా ధ్వజారోహణను చేస్తామని అన్నారు. ధ్వజస్తంభానికి మామిడి ఆకులు, దర్భలను కట్టి, గరుత్మంతుని చిత్రం గీసిన వస్త్రాన్ని అర్చకులు ఎగురవేశారు.

సూర్యనారాయణుని కల్యాణానికి సర్వం సిద్ధం

భారీ ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ




జి.మామిడాడలోని సూర్యదేవాలయం

పెదపూడి: వైష్ణవ సంప్రదాయంలో పూజాదికాలు చేసే ఏకైక సూర్యదేవాలయం ఉన్న మండలంలోని జి.మామిడాడ స్వామివారి కల్యాణానికి సమాయత్తమైంది. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళా శాసనాలతో ఏకాదశి శనివారం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. ఆలయ ఈఓ పాటి సత్యనారాయణ, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొవ్వూరి శ్రీనివాసా బాలకృష్ణారెడ్డి, ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేశారు. బాణసంచా పోటీల్లో గెలుపొందిన వారికి కాసు బంగారం బహుమతి ఇవ్వనున్నారు. రథసప్తమితో ప్రారంభమైన స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 13వ తేదీతో ముగియనున్నాయి. శనివారం వారి కల్యాణం సందర్భంగా ఉదయం 5 గంటలకు నిత్యోపాసన, విశేషహోమం, బలిహరణ, 8 గంటలకు ధ్వజారోహణ, 9 గంటలకు మార్కెట్ సెంటర్‌లో భారీ అన్న సమారాధన, 12.30 గంటకు శ్రీవారి రథోత్సవం, రాత్రి 7 గంటలకు కల్యాణం ప్రారంభమవుతుంది.

ధవళగిరిపై కల్యాణ శోభ

- రేపటి కల్యాణానికి సర్వం సిద్ధం
- వేలాదిగా తరలి రానున్న భక్త జనం



ధవళగిరిపై ఉన్న జనార్ధన స్వామి ఆలయం

ఉత్సవానికి సిద్ధమవుతున్న రథం

ధవళేశ్వరం: నవ జనార్దనులలో ప్రథముడైన ధవళగిరి వాసుని కల్యాణానికి ధవళేశ్వరం సిద్ధమైంది. శనివారం నుంచి ప్రారంభం కానున్న కల్యాణోత్సవాలు ఈ నెల 13 వరకు వైభవంగా సాగనున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాదిమంది రథ, కల్యాణోత్సవాలకు తరలి రానున్నారు. ఇందుకు దేవదాయ, ధర్మదాయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు స్వామివారి రథోత్సవం ప్రారంభమవుతుంది. రథంవీధి నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్ వరకు రథోత్సవం కన్నుల పండగగా సాగి రాత్రి 9.30 గంటలకు కల్యాణం నిర్వహించనున్నారు. ఈ రథానికి 150 ఏళ్ల చరిత్ర ఉంది. సుమారు 40 అడుగులు పొడవైన రథాన్ని ఒకే చెట్టు కలపతో నిర్మించారు. గ్రామ ఆడపడుచులు ఎక్కడున్నా ఈ ఉత్సవాలకు తరలి వస్తారు. రథం పైన కట్టే గొడుగును భక్తులు అరటిపండ్లతో కొట్టడం ఆనవాయితీగా వస్తుంది. ఆ గొడుగుకు అరటిపళ్లు తగిలితే శుభమని గ్రామస్తుల విశ్వాసం.

ముద్రగడపై దాడి పిరికిపందల చర్య

- ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం
- విలేకరులతో వైఎస్సార్‌సీపీ నాయకులు



ముద్రగడ పద్మనాభం, గిరిబాబుతో మాట్లాడుతున్న కుడుపూడి సూర్యనారాయణరావు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం ఇంటిపై జరిగిన దాడిపై ప్రభుత్వం స్పందించాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, అమలాపురం ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కాపు జేఏసీ నాయకులు గురువారం కిర్లంపూడిలోని ముద్రగడ ఇంటికి వెళ్లి ఆయనకు, ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబుకు సంఘీభావం తెలిపారు. తన రాజకీయ జీవితాన్ని ప్రజల కోసమే అంకితం చేసిన ముద్రగడను అవమానించడానికే ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. పెద్ద ఎత్తున్న కాపునాడు ఉద్యమం చేపట్టిన వ్యక్తిపై దాడి చేస్తే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడంలేదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడుగుతున్నారనే ఉద్దేశంతో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాయకులపైనా, కార్యకర్తలపైనా పదేపదే దాడులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం నిజస్వరూపాన్ని ప్రజలు గ్రహించారని, ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ స్పందించి దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు. అలాగే కాపులకు పెద్దన్నగా ఉంటానన్న పవన్ కాపుల కోసం పోరాడిన ముద్రగడ దాడి జరిగితే కనీసం ఖండించలేదని కాపు జేఏసీ నేతలు వాపోయారు. ముద్రగడకు సంఘీభావం తెలిపిన వారిలో చినిమిల్లి వెంకట్రావు, నల్ల విష్ణు, తోట రామకృష్ణ, దుర్గారావు, ఉమామహేశ్వరీ తదితరులు ఉన్నారు.

శివరాత్రి దర్శనాలకు
పటిష్ట ఏర్పాట్లు

పలు ఆలయాల ఈఓలు, అధికారులతో జేసీ నిశాంతి సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిశాంతి

అమలాపురం రూరల్: ఈనెల 26వ తేదీ బుధవారం మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని వివిధ దేవదాయ, ధర్మదాయ శాఖ పరిధిలోని దేవాలయాల్లో భక్తులకు మహాశివుని దర్శనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి అన్నారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లో అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి, వాడపల్లి వెంకటేశ్వరస్వామి, మందపల్లి శనైశ్చరస్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, ద్రాక్షారామ భీమేశ్వరస్వామి, కోటిపల్లి సోమేశ్వరస్వామి, అమలాపురం వెంకటేశ్వరస్వామి దేవస్థానం, పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి ఆలయం, ర్యాలి జగన్మోహిని దేవస్థానం, మురమళ్ల వీరేశ్వరస్వామి దేవస్థానాల అధికారులతో సమీక్షించారు. ఆయా ఆలయాల్లో శాంతి భద్రతల పరిరక్షణ, అదనపు సిబ్బంది, వసతుల కల్పన వంటి సహకారానికి ముందుగానే ప్రతిపాదనలు పంపితే అందుకు తగిన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం సమకూరుస్తుందన్నారు. స్నాన ఘట్టాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ బీఎల్‌ఎస్ రాజకుమారి, దేవదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ డీఎల్వీ రమేష్, వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహక అధికారి ఎన్‌ఎస్ చక్రధరరావు, ద్రాక్షారామ, భీమేశ్వరస్వామి దేవ స్థానం కార్యనిర్వాహక అధికారి ఏవీ దుర్గా భవాని, అయినవిల్లి సిద్ది వినాయక స్వామి దేవస్థానం, అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం కార్యనిర్వహక అధి కారి ముదునూరి సత్యనారాయణ రాజు, వివిధ దేవస్థానాల ఈవోలు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మమ్మ ఇంటికి వచ్చి అనంత లోకాలకు..

- కొత్తపల్లిలో రోడ్డు ప్రమాదం
- బీటెక్ విద్యార్థి మృతి
- కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు



బెండపూడిలో సతీష్ ఇంటివద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



మృతుడు సతీష్ (ఫైల్)

గోకవరం/తొండంగి: రెక్కాడితేగాని డొక్కాడని ఆ కుటుంబంలో రోడ్డు ప్రమాదం తీరని దుఃఖాన్ని నింపింది. ఒక్కగానొక్క కుమారుడిపై ఆ తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. మండలంలోని బెండపూడికి చెందిన బూసాల రామకృష్ణ, గౌరీదేవిలకు కుమారుడు బూసాల సతీష్ (18), కుమార్తె మణి దీపిక ఉన్నారు. తుని మండలం తేటగుంటలో ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తూ ఆ పిల్లలను పోషిస్తున్నాడు రామకృష్ణ. రాజమహేంద్రవరం గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న సతీష్ గోకవరం మండలం కామరాజుపేటలో ఉన్న తన అమ్మమ్మ నీటిపల్లి సత్యవతిని చూసేందుకు నాలుగు రోజుల క్రితం వెళ్లాడు. గురువారం మధ్యాహ్నం తన స్నేహితుడితో కలసి బైక్ స్వగ్రామానికి తిరిగి వస్తుండగా కొత్తపల్లి శివారు ఆదర్శ ఫార్మశీ కళాశాల సమీపంలో భారీ మలుపు వద్ద అదుపుతప్పి పడిపోయాడు. స్థానికులు సతీష్‌ను గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో అతని స్నేహితుడు స్వల్ప గాయాలతో బటయపడ్డాడు. నాలుగు రోజుల పాటు ఎంతో సరదాగా గడిపిన మనవడు మృత్యువాత పడడంతో అమ్మమ్మ సత్యవతి బోరున విలపించడం చూపరులను కలచివేసింది. మరో వైపు తన స్వగ్రామం బెండపూడిలో ఎంతో ఆల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమారుడు ప్రయోజకుడై తమకు అండగా ఉంటాడని ఆశ పడితే అందని తీరాలకు పోయి శోకం మిగిల్చాడని తండ్రి రామకృష్ణ, తల్లి గౌరీదేవి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అందరితో సరదాగా ఉండే సతీష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బెండపూడిలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎస్సై పవన్‌కుమార్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అయినవిల్లి విఘ్నేశ్వరునికి రూ.1,08,774 ఆదాయం



విశేషాలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామికి గురువారం ఒక్క రోజు వివిధ పూజ టిక్కెట్లు, ప్రసాదాలు, అన్నదాన విరాళాలు ద్వారా రూ.1,08,774 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామివారి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు ఒక జంట, లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 18 మంది, శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో ఆరు జంటలు, స్వామివారికి గరిక పూజల్లో 36 మంది భక్తులు పాల్గొన్నారు. ముగ్గురు చిన్నారులకు అన్నప్రాసన, తులాభారం నిర్వహించారు. 14 వాహన పూజలు జరిపారు. స్వామివారి అన్న ప్రసాదాన్ని 1060 మంది స్వీకరించారు.

చదువు చాలించకూడదని..!

- ఫలించిన ఉపాధ్యాయుని ప్రయత్నం
- వాట్సప్ సందేశానికి విశేష స్పందన
- సహకరించిన డీఈఓ.. స్పందించిన కలెక్టర్
- విద్యార్థులకు లైఫ్ జాకెట్ల అందజేత



లైఫ్ జాకెట్లతో విద్యార్థులు

ఐ.పోలవరం: విద్యార్థులంతా తాము చదువుకునే పాఠశాలకు నిత్యం గోదావరి నదీపాయ దాటి వస్తుంటారు. సముద్ర సంగమ ప్రాంతం దగ్గర కావడం వల్ల పోటు, పాటు సమయంలో ఇక్కడ నదీపాయల్లో నీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పటికీ చదువుపై మక్కువతో వారు పడవలపై వస్తున్న విషయాన్ని గుర్తించిన జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వారికి గురువారం లైఫ్ జాకెట్లు అందజేశారు.

ఐ.పోలవరం మండలం జి.మూలపొలం ఉన్నత పాఠశాలకు కాట్రేనికోన మండలం బలుసుతిప్ప నుంచి నిత్యం 95 మంది విద్యార్థులు వస్తుంటారు. వీరంతా ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్నారు. వీరిలో అగ్నికుల క్షత్రియ వర్గానికి చెందినవారే అధికం. గోదావరికి పోటు సమయంలో వీరి కష్టాలను చూసిన పాఠశాల హెచ్‌ఎం కొమ్మన జనార్దనరావు ఇదే విషయాన్ని వాట్సప్ ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషాకు వివరిస్తూ తమ విద్యార్థులకు లైఫ్ జాకెట్లు అందించి రక్షణ కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన డీఈవో ఆ విషయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్ వివరించారు. దీనికి స్పందించిన రెండు మూడు రోజుల్లో 95 మంది విద్యార్థులకు 'లైఫ్' జాకెట్లు అందజేశారు. అలాగే స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సైతం లైఫ్ జాకెట్లు ఇప్పించాలని అక్కడ హెచ్‌ఎం కోరడంతో వారికి కూడా వాటిని అందజేశారు.